

# మొర్రిగూడెం తండాలో టీబీ పరీక్షలు

జన్నారం, జూన్ 11(వుదయం విలేకరి) జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డా. సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు, జన్నారం పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ఉమాశ్రీ ఆధ్వర్యంలో మొర్రిగూడెం తండా గ్రామంలో గురువారం టీబీఎంబీఏ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలో రెండు వారాలకు పైగా జ్వరంతో బాధపడుతున్న వారికి, 60 సంవత్సరాలు పైబడిన 110 మందికి ఎక్స్-రే పరీక్షలు నిర్వహించారు. అనుమానిత లక్షణాలు ఉన్న 20 మందికి తుమ్ము పరీక్షలు చేశారు. ఈ క్యాంప్‌లో సర్పంచ్ తాళ్లపల్లి విజయ లచన్న, ఎంఎల్‌హెచ్‌పీ పూజ, ఎస్‌టీఎస్ సురేష్, హెల్త్ అసిస్టెంట్ పోచయ్య, ఏఎన్ఎం వసంత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 108 సిబ్బంది నిజాయితీ: ప్రమాద బాధితుడి బ్యాగ్, ఫోన్ అప్పగింత



కామారెడ్డి, జూన్ 11 (వుదయం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా ఎన్ హెచ్-44 పర్నిక హోటల్ ఎదురుగా బ్రిడ్జి మీద బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగుల ఈశ్వర్ అనే వ్యక్తికి 108 అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి, ప్రాథమిక చికిత్స అందించి కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో బాధితుడి వద్ద ఉన్న సెల్ ఫోన్, బ్యాగ్ ను సిబ్బంది గుర్తించి, వాటిని భద్రపరిచి పోలీసు అవుట్ పోస్టు అధికారి లక్ష్మణ్ రావుకు అప్పగించారు. ఈ సంఘటన ద్వారా 108 సిబ్బంది ఈయంటి నరేష్, పైలట్ ప్రణిత్ నిజాయితీ చాటుకున్నారు.

# టిఆర్ఎస్ పార్టీలో చేరిన గైని శ్రీనివాస్ గౌడ్



కామారెడ్డి, జూన్ 11 (వుదయం ప్రతినిధి):

కామారెడ్డి నియోజకవర్గ సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు, కామారెడ్డి పంచముఖి హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ గైని శ్రీనివాస్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి గురువారం హైదరాబాదులో టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. కామారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లి టిఆర్ఎస్ పార్టీ లో చేరారు. శ్రీనివాస్ గౌడ్ ను కవిత పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ, టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగను ప్రతి గ్రామాన, మండలాల, జిల్లాలో జెండా గద్దెలు నిర్మించి జెండావిష్కరణ చేయాలని కవిత గైని శ్రీనివాస్ గౌడ్ కు ఆదేశించారు. టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కామారెడ్డి నియోజకవర్గంలో కృషి చేయాలని కవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రంగు నవీనచారి, సదాశివనగర్ మండల టిఆర్ఎస్ అధ్యక్షులు సాయగౌడ్, సతీష్, సాయి కుమార్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి సందర్భంగా ఆంజనేయ స్వామికి పూజలు



జన్నారం, జూన్ 11(వుదయం విలేకరి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జన్నారం బీజేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షులు జి. మధుసూదన్ రావు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మోదీ నాయకత్వంలో దేశం సర్వోన్నత స్థాయికి ఎదగాలని స్వామివారిని కోరారు. అనంతరం మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారత్ అన్ని రంగాలలో దూసుకెళ్తుందని, ప్రపంచ దేశాలే భారత్ వైపు చూసేలా ప్రధాని నరేంద్ర మోడీ పాలన కొనసాగుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మూడోసారి బిజెపిని అధికారంలోకి తీసుకువచ్చాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కూడా బిజెపి పాగా వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు బద్రి నాయక్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందవేణి పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొంతం శంకరయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షులు బెడద గోపాల్, మండల ప్రధాన కార్యదర్శులు ఎరుకల రమేష్ గౌడ్, గాజుల దేవేందర్, గ్రామ ఉపసర్పంచ్ అప్పల జలపతి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాజారావు, మండల నాయకులు సంతోష్ నాయక్, పూర్ణ చారి, గంగాధర్, సాయి, ఏనుగుల రాజేందర్, పిల్లి నర్సయ్య, ధర్మరాజు, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్




నిజాంసాగర్ జూన్ 11 (వుదయం ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు తదితర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన సమయంలో అందే ఈ ఆర్థిక సహాయం వారి కుటుంబాలకు ఊరటనిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తూ ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకొని వాటిని వినియోగించుకోవడం ద్వారా తమ ఆర్థిక, సామాజిక సమస్యలను అధిగమించవచ్చని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, సామాన్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకుడు భుజంగారి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రజా పండరి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంకు లక్ష్మయ్య, ఉప సర్పంచ్ అనీస్ పటేల్, నాయకులు గుర్రపు శ్రీనివాస్, గాండ్ల రమేష్, రామాగౌడ్, ఊరటి వెంకట్, గోలి లక్ష్మణ్, బింగి శేఖర్, కోట కిషోర్ కుమార్, కంబాపురం సాయిలు, బొడ్డు అంజయ్య, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ వి. రాములు




జన్నారం, జూన్ 11(వుదయం విలేకరి) సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జన్నారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ తదితర సేవలను నిబంధనల ప్రకారం వేగవంతంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఈ నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించాలని, సూపర్‌వైజర్లు, ఈఆర్వోలు పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బక్కయ్య, డిటి వెంకటేశం, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం..

## - బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్, జూన్ 11: ఆదిలాబాద్ పట్టణంలోని కే.ఆర్.కే కాలనీలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా కనపర్తి రాజన్న, గణేష్ అన్నదమ్ములకు చెందిన ఇళ్లలో మంటలు చెలరేగి భారీ నష్టం సంభవించింది.

ప్రమాదం విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వెంటనే ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితులకు ఇళ్ల మంజూరు కోసం కృషి చేయడంతో పాటు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాము మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ



కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి ) కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ కానిస్టేబుల్ మరియు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల నియామక పరీక్షలకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జ్ డా. లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ శిక్షణలో చేరేవారు ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగుతుంది.

ప్రతిరోజు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు శిక్షణ నిర్వహించబడుతుంది.

శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఇంటర్ మెమో, 10వ తరగతి మెమో మరియు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.

ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిక్షణలో పాల్గొనాలని కోరారు.

# దుద్దిళ్ల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

## రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలి

## పుట్ట మధు వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు




మంథని, జూన్ 11 (వుదయం ప్రతినిధి): మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఇటీవల రామగుండంలో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం మంథని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్, మంథని డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంథని సత్యం మాట్లాడుతూ దుద్దిళ్ల కుటుంబంపై వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో ఎవరిపైన కక్షపూరిత చర్యలకు పాల్పడదని, చట్టం తన విధి ప్రకారం పనిచేస్తుందని స్పష్టం చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులు ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడంలో దుద్దిళ్ల కుటుంబం సహకారం పొందిన పుట్ట మధుకర్, అదే కుటుంబంపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. రాజకీయ నాయకులు అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించాలే గానీ వ్యక్తిగత దూషణలకు దిగకూడదని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విమర్శలు చేయాలని, రాజకీయ హుందాతనాన్ని పాటించాలని కోరారు.

మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి శ్రీధర్‌బాబు, దుద్దిళ్ల శ్రీను బాబు నిరంతరం కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రాంతాన్ని ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధిని గమనిస్తున్నారని, భవిష్యత్‌లో కూడా వారి నాయకత్వానికే ప్రజల మద్దతు ఉంటుందని అన్నారు. రాజకీయ ఉనికి కోసం వ్యక్తిగత విమర్శలకు పాల్పడకుండా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి అంశాలపై పోటీ పడాలని పుట్ట మధుకర్‌కు సూచించారు. ప్రజలను, అధికారులను భయపెట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం కంటే ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుక్క రవి, రామగిరి మండల అధ్యక్షుడు ఖండే పోశం, మండల ఉపాధ్యక్షుడు అర్ల నారాయణ, మంథని మార్కెట్ డైరెక్టర్ మంథని సదానందం, మండల అధికార ప్రతినిధి తోకల మల్లేష్, నగరంపల్లి సర్పంచ్ న్యాతరి లతా శ్రీనివాస్, ఎరుకల సురేష్, వార్డు సభ్యుడు సూర్యపల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

# ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

లక్షెట్టిపేట్, జూన్ 11 (వుదయం ప్రతినిధి): పట్టణంలోని ఉత్కూర్ చౌరస్తాలో గల శ్రీ రాజా రాజేశ్వర హోటల్ లో ఫుడ్ సేఫ్టీ అధికారి వాసు రామ్ నేతృత్వంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. హోటల్లోని వివిధ ఆహార పదార్థాలను, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల ప్రమాణాలు పాటించకుండా కలుషిత పదార్థాలను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లను పరిశుభ్రంగా ఉంచాలని, హోటళ్లకు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు

## : బడి బాటలో అవగాహన ర్యాలీ



నాగిరెడ్డిపేట్, వుదయం మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గులపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లిన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాజ్, గ్రామ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు జ్యోతి, వార్డు సభ్యులు సాయిబాబా, లాలు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలలో పాఠకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

## -పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ



మంచిర్యాల/జూన్ 11(వుదయం ప్రతినిధి) జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ లతో కలిసి సందర్శించి గ్రంథాలయ పరిధిలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాలలో పాఠకులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రంథాలయంలో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తో కలిసి స్టేషన్ రోడ్ లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీ కి ఆదివాసీ సంఘాలకు ఎలాంటి సంబంధం లేదు




జన్నారం, జూన్11(గురువారం )ఈ నెల 10 బుధవారం జరిగిన ర్యాలీకి మండలంలో ఉన్న నాలుగు ఆదివాసీ సంఘాలకు, 9 తెగలకు ఎలాంటి సంబంధం లేదని రాయిసెంటర్ సార్మేడి కొమ్ముగూడెంకు చెందిన పూసమ్ సోనేరావు, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు రాయిసిడం కాళీ, ఆదివాసి సంఘం మండల అధ్యక్షుడు యశ్వంత్ రావు, రాజ్ గొండ్ సేవాసమితి అధ్యక్షుడు హన్మంతరావు, ఉపాధ్యక్షుడు వసంత్ లు తెలిపారు. గురువారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసి సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ర్యాలీకి పిలుపునిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సైని కోరారు. మండల ఆదివాసీ సంఘాలకు సమాచారం ఇవ్వకుండా చేసే ర్యాలీలకు మండల ఆదివాసీలు, స్పందించవద్దని భవిష్యత్తులో మరొకసారి ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, బొజ్జు, ధర్ము, రాజేశ్వర్, ఆనంద్ రావు, భగవంతరావు, గంగు, మహేష్, భారిక్ రావు, జంగు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

